

# నేను - నా జ్ఞాపకాలు

## - జీడిగుంట రామచంద్రమూర్తి



*రచనా కాలం: 2019*

*(గత సంచిక తరువాయి)*

## నాకు జ్ఞాపకం లేని "ఆ అరవై రోజులు"

అమ్మ ప్రదర్శించిన ఆత్మస్థైర్యం నాకు కొండంత బలాన్ని ఇచ్చింది.

- జె. వేణుగోపాల్, యు.ఎస్.ఎ.(చిన్న కుమారుడు)

"WRITERS BLOCK" అనేది కేవలం నాన్నలాంటి రచయితలకు మాత్రమే ఉంటుందేమో? నాన్న జీవితంలో, ఆయనకు ఏ మాత్రం జ్ఞాపకంలేని ఆ ఇరవై రోజులు గురించి, నాకు గుర్తున్న విషయాలు రాద్దామని గత పదిరోజులుగా పలుమార్లు ప్రయత్నించి నా మస్తకకి ఆలయంలో ఆ జ్ఞాపకాల పుస్తకం దొరక్క వాయిదా వేస్తూ వచ్చాను.

సెప్టెంబరు 1వ తేదీన శ్రీధర్ నాకు ఫోన్ చేసి నాన్న అస్వస్థత గురించి చెప్పటం, అది గుండెకు సంబంధించిన విషయం కాదనీ, మెదడులో నరం రప్చర్ అయింది కనుక, దాన్ని కోయలింగ్‌తో ట్రీట్ చేయాల్సి వస్తుందనీ ఆ సర్జరీ అంత ప్రమాదకరమైంది కాదు కనుక అది పూర్తయ్యాక మళ్ళీ ఫోన్ చేసి వివరాలు చెప్తాననీ చెప్పాడు.

ఆ పరిస్థితిలో నేను హైదరాబాదులోనే ఉండి ఉంటే బావుండేదని అనిపించింది. కానీ కొలికిరాని ఆలోచనలతో బుర్రవేడెక్కిపోయింది. ఆ రాత్రి పడుకున్నా సరిగా నిద్రపట్టలేదు. మర్నాడు పొద్దున్నే లేచి – శ్రీధర్ కానీ, అమ్మకానీ ఫోన్ చేస్తారేమోనని ఎదురు చూశాను. ఎంతసేపటికీ వాళ్ళెవరినించీ ఫోన్ రాకపోవటంతో మనసు అస్థిమితమైపోయింది. చివరకు శ్రీధర్ నించి ఫోన్ వచ్చింది. కోయిలింగ్ ఆప్షన్ ఫెయిలయిందనీ ఇక మెదడును సర్జరీ చేసి క్లిప్పింగ్‌ను ఏర్పాటు చేయాలనీ సర్జరీ చేసే డాక్టరుగారు (సర్జన్) రాత్రికి కానీ రారనీ చెప్పటంతో ఇంటికి ఆతృతగా వచ్చాను ఆఫీసునించి. కంప్యూటర్ ఆన్ చేసి 'గూగుల్'లోకి వెళ్ళి ఆ సర్జరీ గురించిన వివరాలు తెలుసుకున్నాను. వెంటనే ఇండియా వెళ్ళటానికే నిశ్చయించుకుని ఆఫీసులోని 'బాస్'కి ఫోన్ చేసి చెప్పి కిరణ్ (నా శ్రీమతి)కి ఏ విమానంలో టికెట్ దొరికితే, దానికి 'బుక్' చేయమన్నాను. న్యూజెర్సీనించి ఆదివారానికి టికెట్ దొరికింది.

విమానం ఎక్కానన్నమాటే గానీ మనసులో ఆందోళన తీరలేదు. నాన్న త్వరగా డిశ్చార్జ్ కావటానికి దోహదపడే ఏ పనైనా చేయగలనా అని ఆలోచిస్తూ గడిపేశాను.

హైదరాబాదు చేరగానే కుటుంబ సభ్యులందరూ హాస్పిటల్‌లోనే వున్నారని తెలుసుకుని తిన్నగా ఐ.సి.యు.కి వెళ్ళాను. అక్కడే వున్న శ్రీధర్, సారధి, అంతవరకూ జరిగిన చికిత్సల గురించి చెప్పారు. ఇన్‌ఛార్జ్ డాక్టర్ రాగానే ఐ.సి.యులోకి వెళ్ళి నాన్నని చూశాను. సర్జరీ తాలూకు 'కట్లు'తో ఇతర సామాగ్రితో, బెడ్ మీద పడుకుని వున్న నాన్నని చూడగానే మనసు బ్యాలెన్స్ తప్పి కాళ్ళు వణికిన జ్ఞాపకం వుంది.

నేను అమెరికానుంచి రావటంవల్ల వేరే ఏ వ్యవహారాలూ లేకపోవటంతో ఐ.సి.యూ బయట వరండాలోనే వుంటూ వీలున్నప్పుడలా, ముఖ్యంగా డాక్టర్లు 'రౌండ్స్'కి వచ్చినప్పుడూ, నాన్నకి భోజనం ఏర్పాటు చేస్తున్నప్పుడూ పక్కనే వుండే అవకాశం నాకు దొరికింది. అయినా అసహనానికి గురవుతూ వుండేవాణ్ణి. నేను ఇంజనీరింగ్ కాకుండా మెడిసిన్ చదివుంటే బాగుండేదేమోనన్న ఆలోచనకూడా వచ్చింది ఆ సమయంలో.

ఆపరేషన్ అయింతర్వాత నాలుగైదు రోజులు ఐ.సి.యులోనే వుంచి తర్వాత రూంకి తరలించారు. నాన్న రూముకి వచ్చాక కొంత రిలాక్స్ అయ్యారు. అంతలో అమెరికానించి కిరణ్ ఫోన్ చేసి, ఆస్పత్రికి దగ్గర్లో వున్న సాయిబాబా గుడికి వెళ్ళి 108 కొబ్బరికాయలు కొట్టమని నన్ను కోరింది. మర్నాడు ఉదయమే గుడికి వెళ్ళి ఆ మొక్కు పూర్తిచేశాను. ఆ తర్వాత రెండు రోజులకు నాన్నని డిశ్చార్జ్ చేస్తామని చెప్పారు డాక్టర్లు. డిశ్చార్జ్ చేసే సమయానికి నాన్న పరిస్థితి బాగాలేదు. నిలబడలేకపోతున్నారు. 'ఇంకా రెండు మూడు రోజులు ఆస్పత్రిలోనే వుంచితే బాగుంటుందేమో' అనిపించి డాక్టరుగారికి చెప్పాం.

డాక్టరుగారు మళ్ళీ పరీక్ష చేశారు. మెదడులోకి ఫ్లూయిడ్స్ చేరాయనీ దానివల్ల ఒత్తిడి ఏర్పడిందనీ మళ్ళీ చిన్న సర్జరీ చేసి స్టంటు వెయ్యాలనీ చెప్పారు. తప్పలేదు. మళ్ళీ అందరం నిరుత్సాహానికి గురయ్యాం. అయితే అక్కడి డాక్టర్ల మీద, ఇతర సిబ్బంది మీదా ఏర్పడిన నమ్మకం. మాలో ధైర్యాన్ని నింపింది.

మూడు నాలుగురోజు నాన్న చేయి పట్టుకుని హాస్పిటల్‌లో బాల్కనీలో వాకర్‌తో నడిపించటం ఓ విలువైన జ్ఞాపకం. అలాగే నాన్నకి నచ్చిన పాటలు వాక్‌మెన్ ద్వారా హెడ్‌ఫోన్‌లో నాన్నకి వినిపించటం కూడా నేను మరిచిపోలేని జ్ఞాపకం.

ఈసారి సర్జరీ అయింతర్వాత త్వరగానే రూముకి చేర్చారు. ఫలితం కనిపించింది. నాన్న కోలుకోవటం జరిగింది. ఇక రెండు రోజుల్లో డిశ్చార్జ్ అయి ఇంటికి వెళ్ళే అవకాశం వుందని నాకు అనిపించింది. నాకు 18 వ తేదీన తిరుగు

ప్రయాణానికి టిక్కెట్టు వుండటం వల్లనైతేనేం డాక్టర్లు కూడా వెళ్ళవచ్చునని చెప్పటం వల్లనైతేనేం నేను ప్రయాణానికి సిద్ధమయ్యాను.

ఇలాంటి అత్యవసర పరిస్థితుల్లో, అనుకోని ప్రమాదాలు జరిగే సందర్భాల్లో అమ్మ ప్రదర్శించే ఆత్మస్థైర్యం నాక్కూడా కొండంత బలాన్ని ఇచ్చేది. నేను 1992లో మొదటిసారి పై చదువుల కోసం అమెరికా వచ్చిన కొత్తలో అస్వస్థతకు గురైనప్పుడు ఫోన్లో చెప్పిన మాటలు నా మదిలో ప్రతిధ్వనించాయి. 'కష్టపడు.. కానీ బాధ పడకు'. ఈ మాట జీవన ప్రయాణానికి జిపిఎస్ (GPS) లాంటిదనిపించింది.

ఇలాంటి ఆలోచనల పునాది మీద బ్రతుకుతున్న నాకు, మనసు పూర్తిగా స్థిమితపడి నాన్న దగ్గర వీడ్కోలు తీసుకుని తిరుగు ప్రయాణమయ్యాను.

మొత్తానికి వైద్యులు ఘనమైన వైద్యాన్ని అందించటం. భగవంతుని ఆశీస్సులు లభించటం, బంధుమిత్రులు తమవంతు సహకారాన్ని అందించటం – వీటన్నింటివల్లా నాన్న పూర్తిగా కోలుకున్నారు.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

COMMENTS